క్లుప్తంగా

ఆనందంగా పండుగ జరుపుకోవాలి


ఎమ్మెల్యే కిలివేటి

నాయుడుపేటటౌన్: ముస్లింలు రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆకాంక్షించారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని ఎమ్మెల్యే ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మున్సిపల్ చైర్పర్సన్ కటకం దీపిక, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి కట్టా సుధాకర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డి, బైనా మల్లికార్జునరెడ్డి కూడా శుభాకాంక్షలు తెలిపారు.

సుఖసంతోషాలు వెల్లివిరియాలి


రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి: అల్లా ఆశీర్వాదంతో ముస్లింల కుటుంబాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆకాంక్షించారు. ముస్లింలందరికీ ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

దక్కిలి: మండలంలోని వెలుగొండలు కింద ఉన్న యోగనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి నాలుగు రోజులు పాటు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు విజయ్‌కుమార్, సుబ్బారావు శుక్రవారం తెలిపారు.

సోషల్ ఆడిటింగ్‌పై శిక్షణ



సూళ్లూరుపేట రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరగనున్న సోషల్ ఆడిటింగ్‌పై హెచ్ఎంలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. శుక్రవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఎంఈఓ ఆంజనేయులు ఆధ్వర్యంలో సోషల్ ఆడిటింగ్ ట్రైనర్ రాజేష్‌బాబు పలు విషయాలపై అవగాహన కల్పించారు. పాఠశాల స్థాయిలోని కమిటీ సభ్యులకు ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఎం.వెంకటేశ్వర్లురెడ్డి, కవిత పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయండి

కోట: ఆమ్ ఆద్మీ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మణి నాయుడు సూచించారు. ఆప్ నియోజకవర్గ స్థాయి సమావేశం శుక్రవారం కోట షాదీమంజిల్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నగేష్, కోడివాక చందు, అప్పంగారి జైపాల్ పాల్గొన్నారు.

కమ్యూనిటీహాలు ప్రారంభం



సూళ్లూరుపేట: పట్టణంలోని అలవల రోటరీ ఐ హాస్పిటల్ పైన రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పాల్‌హారిస్ రోటరీ కమ్యూనిటీ హాల్‌ను శుక్రవారం చెంగాళమ్మ ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు ఆరణి విజయభాస్కర్‌రెడ్డి, కార్యదర్శి దువ్వూరు సుబ్రమణ్యంరెడ్డి, రోటేరియన్లు ఆదిశేషారెడ్డి, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, వేనాటి విజయలక్ష్మి, డాక్టర్ సాయిబాబా, అలవల సురేష్, నాదెళ్ల శాంతకుమారి, జానకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బినామీ రుణాలపై విచారణ



బాలాయపల్లి(వెంకటగిరి): బాలాయపల్లి మండలం యాచవరం, జయంపు ప్రాథమిక సహకార సంఘాల్లో బినామీ పేర్లతో రుణాలు పొందారని కయ్యూరు గ్రామానికి చెందిన ఆర్ చెంచు గోపాల్ జిల్లా కలెక్టర్, జిల్లా సహకార అధికారికి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం యాచవరం పీఏసీఎస్‌లో సహకారశాఖ ఇన్‌స్పెక్టర్ డి మాధవి విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రికార్డులను పరిశీలించి, ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు.

కిలివేటి హయాంలోనే అభివృద్ధి



నాయుడుపేట: ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య హయాంలోనే నియోజకవర్గం అభివృద్ధి జరిగిందని, వేనాటి మీరేమిమాట్లాడుతున్నారో తెలుసాని వైఎస్సార్ సీపీ ట్రేడ్‌యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డి అన్నారు. నాయుడుపేటలోని ఆయన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కట్టా మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సూళ్లూరుపేట అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడంతో ఎమ్మెల్యే కిలివేటి రూ.కోట్లు నిధులు మంజూరు చేయించుకొచ్చారన్నారు. నియోజకవర్గంలో రూ.వందల కోట్ల నిధులతో పనులు జరుగుతుంటే టీడీపీ నాయకులు అవాకులు చవాకులు పేల్చుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు రాజశేఖర్‌రాజు, ఎస్ ప్రేమ్‌చంద్, వీ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దిగుబడి ఘనం.. డిమాండ్ స్వల్పం

నేలతల్లిని నమ్ముకున్నారు. మిర్చిసాగు చేశారు. దిగుబడి అధికంగా వచ్చింది. తమ కష్టాలు తీరుతాయని భావించారు. డిమాండ్ లేక.. మిర్చి అమ్ముడు పోక.. పెట్టుబడులు దక్కక.. దిగాలు చెందుతున్నారు. ఇదీ పెళ్లకూరు మండలంలో మిర్చి రైతుల పరిస్థితి.

– పెళ్లకూరు

- ఘాటు తగ్గిన మిర్చి
- 5వేల ఎకరాలకు పైగా మిర్చి సాగు


రాసిపోసిన ఎండుమిర్చి

పెళ్లకూరు మండలంలోని మెట్ట ప్రాంత రైతులంతా కొండంత ఆశతో మిర్చి సాగు చేశారు. దిగుబడి ఆశాజనకంగా వచ్చింది. అయితే డిమాండ్ లేక ధర తగ్గిపోయింది. దీంతో పుడమి పుత్రులు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని తాళ్వాయిపాడు, రోసనూరు, కానూరు, పెన్నేపల్లె, కృష్ణప్పకండ్రిగ, బంగారంపేట, జీలపాటూరు, పాలచ్చూరు, చావలి, చెంబడిపాళెం, రాజుపాళెం, నందిమాల, బంగారంపేట తదితర గ్రామాల్లో రైతులు ఈ ఏడాది సుమారు 5 వేల ఎకరాల్లో వరికి ప్రత్యామ్నాయంగా మిర్చి సాగు చేశారు. ప్రియాంక, ఇండాం –5, నయనతార 525, ప్రొవిజన్ 995 రకాల విత్తనాలను చిత్తూరు, ఒంగోలు, అనంతపురం ప్రాంతాల నుంచి కిలో రూ.38 వేలు వెచ్చించి, తెచ్చి సాగు చేశారు. పెట్టుబడికి తగినట్టుగా దిగుబడులు ఆశాజనంగా వచ్చాయి. దీంతో రైతులంతా సంతోష పడ్డారు. దీనికి తగ్గట్టు ప్రారంభంలో పచ్చిమిర్చి ధరలు కిలో రూ.22 నుంచి రూ.18 వరకు పలికాయి. దీంతో రైతులు తమ పంట ఉత్పత్తులను ఆగ్రా, ఢిల్లీ ప్రాంతాలకు ఎగుమతులు చేశారు. పంట దిగుబడి ప్రారంభమైన 20 రోజులకే పచ్చిమిర్చి ధరలు బాగా తగ్గిపోయాయి. ఒక్కసారిగా రూ.10కి పడిపోయింది. దీంతో పచ్చిమిర్చి కోయకుండా పండు మిర్చి కోసం పంటను వదిలారు. పండు మిర్చి దిగుబడి కూడా ఘనంగా వచ్చింది. అయితే ఎండుమిర్చి ప్రారంభంలో కిలో రూ.150 వరకు పలికినా ప్రస్తుతం రూ.100కు పడిపోయింది. దీంతో పెట్టుబడులు దక్కక మిర్చి సాగు చే రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. ఎండు మిర్చి నిల్వ చేయడానికి కోల్డ్ స్టోరేజీ సౌకర్యం కూడా లేకపోవడంతో రైతులు పెట్టుబడులు కూడా రాక ఆందోళన చెందుతున్నారు.

కోల్డ్ స్టోరేజ్ లేకనే ఇక్కట్లు



పెళ్లకూరు మండలంలోని ఏటా ఐదువేల ఎకరాలకు పైగా మిర్చి సాగు చేస్తారు. ప్రారంభంలో పచ్చిమిర్చి విక్రయించుకోవడానికి మార్కెట్ సదుపాయం లేక వ్యాపారుల లావాదేవీలతో ఆగ్రా, ఢిల్లీ ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఎండుమిర్చిని నిల్వ చేసుకోవడానికి కోల్డ్‌స్టోరేజ్ లేకపోవడంతో ఇక్కడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిర్చి సాగు అధికంగా చేపట్టే ఈ ప్రాంతంలో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలి.

– కిరణ్‌రాజు, రైతు, రాజుపాళెం

జగనన్నను మళ్లీ ఆశీర్వదించండి


పూలతోట ఎస్సీ కాలనీలో ఓ మహిళకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

దొరవారిసత్రం: రాష్ట్రంలో గత నాలుగేళ్ల పాలనలో సంక్షేమ పథకాలు అమలు, మహిళ సాధికారత, రైతు సంక్షేమాన్ని చూసి రానున్న ఎన్నికల్లో జగనన్నను ఆశీర్వదించి, మళ్లీ గెలిపించాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కోరారు. శుక్రవారం పూలతోట సచివాలయం పరిధిలోని వడ్డికండ్రిగ, పూలతోట, కట్టువాపల్లె, పూలతోట ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు సంక్షేమ పథకాల గురించి వివరించి, బుక్‌లెట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ పేదల కష్టనష్టాలు తెలిసిన వ్యక్తి జగనన్న ఒకరే అని, అందుకే ఆయన ప్రతి నెలా ఒకటో తేదీనే ఠంఛన్‌గా పింఛన్ నగదు పంపిణీ, క్రమం తప్పకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేసుకుంటూ గ్రామాల్లో అభివృద్ధి బాటలు కళ్లెదుటే కనిపిస్తున్నా అభివృద్ధి ఎక్కడ జరిగిందంటూ డప్పులు కొట్టుతున్నారన్నారు. రైతు, పొదుపు మహిళ రుణ మాఫీతోపాటు బ్యాంకులో బంగారు ఆభరణాల రుణాల సైతం మాఫీ చేస్తామని చెప్పి తీరా అధికారంలో వచ్చిన తరువాత చేతులెత్తేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట చెంగాళ్లమ్మ ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఈశ్వరవాక శ్రీనివాసులరెడ్డి, నాయకులు బాబునాయుడు, రాజగోపాల్, మహేష్, సుధాకర్, వీరస్వామినాయుడు, అంకయ్య, సురేష్‌రెడ్డి, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధికే ఉపాధి హామీ


మాట్లాడుతున్న పీడీ శ్రీనివాస్‌ప్రసాద్

ఓజిలి: పేదల ఆర్థికాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం అమలు చేసిందని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి 31 వరకు మండలంలో ఉపాధి హామీ పథకం, వైఎస్సార్ క్రాంతి పథం, హౌసింగ్, స్కూల్ ఎడ్యుకేషన్, పశుసంవర్ధకశాఖ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలకు సంబంధించి రూ.23 కోట్లతో పనులు చేశారన్నారు. 26 పంచాయతీల్లో ఉపాధి పనులు చక్కగా జరిగాయన్నారు. ఉపాధి హామీలో వెలుగు చూసిన చిన్న చిన్న పొరపాట్లకు సంబంధించి క్షేత్రసహాయకుల నుంచి రూ.59,380 నగదు రికవరీకి ఆదేశించారు. వచ్చే సామాజిక తనిఖీకి ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండలంలో ఉపాధి పనులను సమర్థవంతంగా చేయిస్తున్న ఏపీఓ ఉషారాణిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అంబుడ్స్‌మన్ నారసనాయుడు, డీఈఓ భాగ్యలక్ష్మి, ఎస్సార్పీ ఎంఎస్‌రాజు, ఎంపీడీఓ రజనీకాంత్ పాల్గొన్నారు.

ఆస్పత్రి స్థలానికి హద్దులు ఏర్పాటు


హద్దులు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

చిల్లకూరు: చింతవరంలోని పీహెచ్‌సీకి కేటాయించిన స్థలం ఆక్రమణలకు గురవుతుండడంతో వైద్యులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా కొలతలు వేసి, హద్దులు ఏర్పాటు చేశారు. చింతవరం పీహెచ్‌సీకి ప్రభుత్వం 5 ఎకరాల భూమిని కేటాయించింది. ముందుభాగంలో భవనం నిర్మించగా మిగిలిన స్థలం ఖాళీగా ఉంది. ఈ క్రమంలో గ్రామంలోని కొంత మంది ఆస్పత్రి స్థలాన్ని ఆక్రమించుకున్నారు. వైద్యులు పాల్ జాన్సన్ ఆక్రమణల విషయాన్ని తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ కొలతలు వేసి, హద్దులు ఏర్పాటు చేయాలని సచివాలయ సర్వేయర్, వీఆర్వోలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో సర్వే, రెవెన్యూ సిబ్బంది శుక్రవారం సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పాలూరు మాధవి, వీఆర్వో జగదీష్ పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న దాత

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి వెంకటగిరికి చెందిన మల్లం గణేష్ అనే దాత శుక్రవారం రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఈ మొత్తాన్ని ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డికి అందజేశారు. ఆయన శుక్రవారం ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం చైర్మన్ కార్యాలయంలో ఈ నగదు అందజేశారు. పాలకమండలి సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంజాన్‌కు ఏర్పాట్లు


నమాజు కోసం వేసిన షామియానా

గూడూరు: ఆకాశంలో శుక్రవారం రాత్రి నెలవంక దర్శనంతో రంజాన్ పర్వదినం శనివారం ఖరారైంది. ముస్లింలందరూ పట్టణంలోని పెద్ద మసీదు వద్ద భారీగా బాణసంచా పేల్చుతూ, ఆనందోత్సాహం వ్యక్తం చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ ముందస్తు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


బాణసంచా పేల్చుతున్న ముస్లింలు

మసీదులు ముస్తాబు

నాయుడుపేటటౌన్: రంజాన్ పండుగను శనివారం ఉదయం నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈదుల్ ఫీతర్ నమాజును సామూహికంగా జరిపేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. శుక్రవారం రంజాన్ మాసంలో చివరి రోజు కావడంతో ముస్లింలు ఉపవాసాలు ఉండి రాత్రి తరాబీ నమాజులో పాల్గొని ఒకరికొకరు ఈద్ ముబారక్ తెలుపుకున్నారు.

మోసంపై ఫిర్యాదు

నాయుడుపేటటౌన్: పొదుపు కార్యాలయంలో పనిచేస్తున్న అధికారి అని పరిచయం చేసుకుని పొదుపు మహిళలకు రుణాలు ఇప్పిస్తానని నమ్మబలికించి రూ.11,500 నగదు తీసుకుని మోసం చేసిన విషయంపై శుక్రవారం బాధితుడు పొందురు మునస్వామి ఆచారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు కథనం మేరకు.. మండలంలోని మర్లపల్లెకు చెందిన మునస్వామి ఆచారి ఇంటి వద్దకు శుక్రవారం ఓ వ్యక్తి మోటర్ సైకిల్‌లో వచ్చి తమ పూర్తి వివరాలు, తన భార్య పొదుపు వివరాలను సైతం చెప్పి, పొదుపు రుణాలు ఇచ్చే కార్యాలయంలో పనిచేసే ఏపీఓ రాజశేఖర్‌గా పరిచయం చేసుకున్నాడు. మీరు ఇంటి వద్ద గెదెలు పెట్టుకుని జీవనం సాగించేందుకు రూ.7 లక్షలు రుణం ఇప్పిస్తానని అందులో రూ.2 లక్షలు సబ్సిడీ పోతుందని మిగిలిన రూ.5 లక్షలు నగదు చెల్లించాల్సి ఉంటుందని నమ్మబలికాడు. అలాగే ఇంటి నిర్మాణానికి కూడ రుణం ఇప్పిస్తానని మాయ మాటలు చెప్పి నమ్మించాడు. ఇందుకు మీరు ముందుగా దరఖాస్తులు, ఇతర ఖర్చు లకు నగదు చెల్లించాలని చెప్పి రూ.11,500 నగదు తీసుకుని వెళ్లాడు. అనంతరం అతని ఫోన్ స్విచ్ ఆఫ్ అని రావడంతో మోసపోయామని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అవాస్తవ ఆరోపణలు మానుకోండి

దక్కిలి: అభివృద్ధిలో రాష్ట్రం వెనుకంజలో ఉందని టీడీపీ నాయకులు సోషల్ మీడియాలో అవాస్తవ ఆరోపణలు చేయడం మానుకోవాలని జేసీఎస్ మండల కన్వీనర్ చింతల శ్రీనివాసులురెడ్డి అన్నారు. దక్కిలి ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని మాటుమడగు గ్రామానికి చెందిన టీడీపీ మండల ఇన్‌చార్జి పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి సోషల్ మీడియాలో రాష్ట్రంలో అభివృద్ధిపై అవాస్తవాలను ప్రచారం చేయడాన్ని ఖండించారు.

సైక్లింగ్‌తో శారీరక వ్యాయామం


సైక్లింగ్ చేస్తూ విద్యార్థులకు సంఘీభావం తెలుపుతున్న డీఎస్పీ సూర్యానారాయణరెడ్డి

గూడూరు: సైక్లింగ్ గొప్ప శారీరక వ్యాయామని, దీని వినియోగంతో పర్యావరణాన్ని పరిరక్షించినవారవుతారని డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి అన్నారు. కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ విద్యార్థులు శుక్రవారం సైక్లింగ్ మార్తాన్ కార్యక్రమంలో భాగంగా గూడూరుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ వారికి పాత బస్టాండ్ సెంటర్ వద్ద సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఎక్కువగా సుదూర ప్రాంతాలకైనా సైకిళ్లపైనే వెళ్లేవారన్నారు. ఈ క్రమంలో ఎంతో శారీరక వ్యాయామం కలుగుతుందని, దీంతో ఎన్నో వ్యాధులు దూరమవుతాయన్నారు. అలాగే వాహనాల వినియోగం విపరీతంగా పెరిగిపోయిందని, ఈ క్రమంలో సైకిల్ వినియోగం ద్వారా కలిగే ప్రయోజనాలను ప్రజలకు చూపే క్రమంలో ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ విద్యార్థులు నిర్వహిస్తున్న సైక్లింగ్ మార్తాన్ నిర్వహించడం అభినందనీయమన్నారు.

శరవేగంగా భూ రీసర్వే


భూములు సర్వే చేస్తున్న సిబ్బంది

పెళ్లకూరు: జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకం కింద భూములు రీసర్వే పనులు మండలంలో శరవేగంగా సాగుతున్నాయి. శుక్రవారం జీలపాటూరులో భూరీసర్వే చేపట్టిన రెవెన్యూ అధికారులు సర్వే నంబరు 6లో దళితులు సాగు చేసుకుంటున్న భూములను సర్వే చేశారు. విఆర్‌ఓ ఎమ్, సునంద, వీఆర్‌ఏ కృష్ణ పాల్గొన్నారు.

వేకువజాము నుంచే ఉపాధి పనులు

చిల్లకూరు: ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో ఉపాధి హామీ పనులు ఇకపై వేకువజాము నుంచే చేపట్టేలా పంచాయతీలో తీర్మానం చేయడంతో కూలీలు అంగీకరించారు. మండలంలోని పారిచెర్లవారిపాళెంలో శుక్రవారం రోజ్‌గార్ దివస్ కార్యక్రమం చేపట్టి పంచాయతీ సర్పంచ్ వరదిరెడ్డి అరుణమ్మ సహకారంతో కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామసభ నిర్వహించి కూలీలందరి అంగీకారంతో రోజూ వేకువజామున పని ప్రాంతంలోకి వెళ్లి త్వరగా పనులు పూర్తి చేసుకునేలా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఉపాధి ఏపీఓ గిరి మాట్లాడుతూ ఎండలు రోజురోజుకూ పెరుగుతుండడంతో వేకువజామున 5.30 గంటలకు పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. క్షేత్ర సహాయకులు శేషురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాయు కాలుష్యాన్ని అరికట్టాలి

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ మెకానికల్ విభాగం విద్యార్థులు శుక్రవారం వాయు కాలుష్యం– మానవ ఆరోగ్యంపై దాని ప్రభావం అనే అంశాన్ని ప్రజలకు వివరిస్తూ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎన్‌బీకేఆర్‌లో ఆ కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగం హెచ్‌ఓడీ విక్రమ్‌కుమార్, సొసైటీ ఆఫ్ ఆటోమోటివ్ ఇంజినీర్స్ ఇండియా అసోసియేషన్ కార్యదర్శి అశోక్‌కుమార్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కిషంధర్ పాల్గొన్నారు.

మెట్టు పాఠశాలకు రూ.లక్ష విరాళం


నగదు అందజేస్తున్న సుందరయ్య కుటుంబ సభ్యులు

చిట్టమూరు: మండలంలోని మెట్టు జెడ్పీ హైస్కూలుకు పూర్వ విద్యార్థి పేరుతో అతని కుటుంబసభ్యులు రూ.లక్ష విరాళం ఇచ్చారు. మెట్టు పాఠశాల్లో గతంలో విద్యనభ్యసించిన సుందరయ్య జ్ఞాపకార్థం ఆయన సతీమణి శకుంతలమ్మ, కుమారుడు సురేష్‌బాబు ఈ మొత్తాన్ని హెచ్ఎం షేక్ నసీంఆలీకు శుక్రవారం అందజేశారు. ఈ నగదును పాఠశాల్లో పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతిగా అందజేయాలని కుటుంబ సభ్యులు తెలిపారని హెచ్ఎం చెప్పారు. టీచర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సుబ్రమణ్యేశ్వర స్వామి సేవలో ఆర్డీఓ


చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

చిట్టమూరు: మండలంలోని మల్లాంలో ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామివారిని గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ శుక్రవారం దర్శించుకున్నారు. అర్చకులు శాలువ, పూలమాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం నూరుకాళ్ల కల్యాణ మండపాన్ని సందర్శించారు. వాకాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి, తహసీల్దార్ నరసింహారావు పాల్గొన్నారు.

జార్ఖండ్‌కు చెందిన వ్యక్తి అనుమానాస్పద మృతి

చిల్లకూరు: జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి ఓడూరు సమీపంలోని అటవీ ప్రాంతంలో అనుమానాస్పదంగా మృతి చెంది ఉండడాన్ని శుక్రవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల కథనం.. మండలంలోని ఓడూరు గ్రామ సమీపంలోని సర్వే నం.1లో ఉన్న పొలాల్లోని జామాయిల్ చెట్ల మధ్య సుమారు 50 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. ఇతని శరీరం కొంత భాగం కుళ్లిపోయి ఎముకలు కనిపిస్తున్నాయి. సుమారు పది రోజులు క్రితం మృతి చెంది ఉండవచ్చు. ఇతని షర్టు చెట్టుకు తగిలించి ఉంది. అందులో సెల్ ఫోన్‌తో పాటు అతని ఆధార్ కార్డు ఉంది. ఆధార్ కార్డు ఆధారంగా ప్రభుసింగ్ తండ్రి కామేశ్వరసింగ్, జార్ఖండ్ రాష్ట్రం, చైనాపూర్, చాండో పోలీస్ స్టేషన్ పరిధిలోని టేటారియాదమార్ గ్రామంగా గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. అయితే ఇతను ఈ ప్రాంతంలోకి వచ్చి మృతి చెంది ఉండడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఆ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

విస్తృతంగా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం


నాయుడుపేట: కరపత్రం అందజేస్తున్న నాగార్జున


ఓజిలి: ఇనుగుంటలో..

నాయుడుపేటటౌన్: పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు విస్తృతంగా నిర్వహించారు. రెండో వార్డులో కౌన్సిలర్ పాలేటి నాగార్జున ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు.

ఓజిలిలో..

ఓజిలి: మండలంలోని ఇనుగుంట పంచాయతీ పరిధిలోని పాళెంపాడు, చవట, ఎస్సీ కాలనీల్లో సర్పంచ్ కొణిదల విజయమ్మ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.

నాయుడుపేటలో క్షుద్ర పూజల కలకలం


క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు

నాయుడుపేటటౌన్ : పట్టణంలో క్షుద్రపూజలు కలకలం రేపాయి. శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు సమీపంలో గిండి వారితోట వీధిలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటి వద్ద గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు స్థానికులను భయాందోళనకు గురిచేశాయి. ఇంటి యజమాని గోపి కుటుంబ సభ్యులు ఈ సంఘటనపై శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గోపి సమీపం బంధువు అయిన ఓ వ్యక్తితో కొద్ది రోజులు కిందట గొడవలు జరిగాయి. కోపంతో అతనేమై ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

సైదాపురం: మండలంలోని కమ్మవారిపల్లె, చాగణం, సైదాపురం గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను రాపూరు సీడీపీఓ సునంద శుక్రవారం తనిఖీలు చేశారు. ప్రీ స్కూల్ పిల్లల హాజరు, పౌష్టికాహారంపై ఆరా తీశారు.

కండలేరులో 39.422 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 39.422 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,380 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 10, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 30, లోలెవల్ స్లూయిస్‌కు 30, హైలెవల్ స్లూయిస్‌కు 60 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు


తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్ఎం నారాయణ

వెంకటగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు, నాణ్యమైన విద్య లభిస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని బంగారుపేట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం నారాయణ తెలిపారు. బంగారుపేటలో 6 ఏళ్లు నిండిన పిల్లలున్న తల్లిదండ్రులను శుక్రవారం కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏ వెంకటేశ్వర్లు, సంపూర్ణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్ యశోద, సీహెచ్ సరిత తదితరులు పాల్గొన్నారు.